క్లుప్తంగా

ఎస్‌ఐని కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



ఎస్‌ఐ రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

గాండ్లపెంట: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ట్రైనీ ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ రవికుమార్‌ను శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, బీసీ కన్వీనర్ జక్కల లక్ష్మి, నరసింహా గౌడ్, మండల యూత్ కన్వీనర్ రవిచంద్రారెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ ఎస్‌ఎండీ ఫరూక్, పామిడి ఇక్బాల్, రామాంజులురెడ్డి, ఆసిఫ్, లోకేశ్వర్‌రెడ్డి, ఇలియాస్,మూజాహుద్దీన్, చంద్రా, ప్రభాకర్‌రెడ్డి, మస్తాన్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేసినట్లు సర్టిఫికెట్లు చూపుతున్న శ్రీసాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు

ధర్మవరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని శ్రీ సాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చాంద్‌భాషా, ప్రిన్సిపల్ ఫణికుమార్, కళాశాల ప్రెసిడెంట్ పోలా ప్రభాకర్ కోరారు. స్థానిక శ్రీసాయి డిగ్రీ కళాశాలలో శుక్రవారం యువర్స్ ఫౌండేషన్, చౌడేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో 30మంది కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం విద్యార్థులకు రక్తదానం ఆవశ్యకతను వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి సేవా గుణం అలవర్చుకుని ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి వాసికి డాక్టరేట్ ప్రదానం



రాజ్యలక్ష్మి

కదిరి అర్బన్: చిప్పలమడుగు గ్రామానికి చెందిన రాజ్యలక్ష్మికి శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆర్థిక శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ వెంకటనాయుడు పర్యవేక్షణలో ×ఆంధ్ర ప్రదేశ్‌లో రైతుల ఆత్మహత్యలు, అనంతపురం జిల్లాలో వేరుశన రైతుల ఆత్మహత్యలపై ప్రత్యేక సూచన¤ అన్న అంశంపై పరిశోధన చేశారు. రాజ్యలక్ష్మి పామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

తాడిమర్రి: ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహిస్తే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ కృష్ణమోహన్ పేర్కొన్నారు. ఆత్మకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఉమాపతి ఎంఈఓగా పదోన్నతిపై కంబదూరు మండలానికి వెళ్లారు. అలాగే సీసీంద్రి అనే ఉపాధ్యాయుడు కూడేరు మండలం ముద్దలాపురం, పార్వతి అనే ఉపాధ్యాయురాలు మాల్యవంతం గ్రామాలకు బదిలీ అయ్యారు. ఎంఈఓతో పాటు తోటి ఉపాధ్యాయులు వారికి శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ శెట్టిపల్లి వెంకటనారాయణరెడ్డి, ఉపసర్పంచ్ అల్లే సాయినాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



వేపాకుల అలంకరణలో పెద్దమ్మతల్లి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాలే వీధిలో వెలసిన పెద్దమ్మతల్లికి శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు వెంకటేష్ శర్మ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, విశేష మంగళద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం వేపాకులతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. బుగ్గా వంశస్తులు, మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు.

పేరు మార్చి.. కేంద్రాలను కుదించి..



నల్లచెరువు: నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రం



నల్లచెరువు రైతు సేవ కేంద్రం

- కూటమి ప్రభుత్వం నిర్వాకం
- రైతులకు అందని ప్రభుత్వ సేవలు
- పని చేయని కియోస్క్ యంత్రాలు
- అన్నదాతలకు తప్పని ఇబ్బందులు

నల్లచెరువు: వ్యవసాయానికి సంబంధించిన సేవలను రైతుల ముంగిటకే తీసుకెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ స్థాయిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతుల అన్ని సమస్యలు పరిష్కరించేందుకు ఆర్బీకేలు అప్పట్లో రైతులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. రైతులకు స్థానికంగా ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు సబ్సిడీ విత్తనాలు తదితర సేవలు గ్రామాల్లోనే అందేవి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతుభరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. రేషనలైజేషన్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల తరహాలో రైతు సేవా కేంద్రాలను కూడా విలీనం చేయడంతో సేవలు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పది నుంచి ఏడింటికి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండలంలో 10 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అందులో లక్షలు విలువ చేసే అధునాతన సాంకేతిక సాయంతో పని చేసే కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం తాజాగా రైతు సేవా కేంద్రాలను 10 నుంచి ఏడుకు కుదించింది. మిగిలిపోయిన ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేసింది. ప్రస్తుతం అల్లుగుండు, ఎం అగ్రహారం, పంతుల చెరువు, పి. కొత్తపల్లి గ్రామాల్లో మాత్రమే రైతు సేవా కేంద్రాలు పని చేస్తున్నాయి. మేజర్ పంచాయతీలో రెండు రైతు సేవా కేంద్రాలను తలమర్ల వాండ్లపల్లి పంచాయతీలో సచివాలయం-2 ఓరువాయి పంచాయతీలో ఉబిచర్ల రైతు సేవా కేంద్రాన్ని కె.పూలకుంట పంచాయతీలో విలీనం చేశారు. దీంతో ఓరువాయి, తలమర్ల వాండ్లపల్లి పంచాయితీ రైతులు నల్లచెరువుకు కె. పూలకుంట రైతులు ఉబిచర్లకు రావాల్సి ఉండడంతో ఇబ్బందులు తప్పవని రైతులు వాపోతున్నారు. మిగిలిన గ్రామాల రైతుల పరిస్థితీ ఇలానే ఉంది. గతంలో ఏ చిన్న పని కావాలన్నా రైతులకు స్థానికంగా జరుగుతుండేవని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. విలీనం చేశాక సేవలకు సుదూరం వెళ్లాల్సిన పరిస్థితి వస్తోందని వాపోతున్నారు. క్రాప్ బుకింగ్ ద్వారా పంట సాగు తక్కువ ఉందనే నెపంతో రైతు సేవా కేంద్రాలను కుదించారనే ఆరోపణలు ఉన్నాయి.

దిష్టిబొమ్మల్లా కియోస్క్ యంత్రాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు సేవా కేంద్రాల్లో, కియోస్క్ యంత్రాలు వినియోగంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రస్తుతం సాంకేతిక లోపం, ఇంటర్నెట్ సమస్యలతో కియోస్క్ యంత్రాలు మూలన పడ్డాయి. కొన్ని చోట్ల దుమ్ము పట్టిపోయాయి. గతంలో రైతులకు కావాల్సినవన్నీ ఆర్బీకే(ప్రస్తుతం ఆర్‌ఎస్‌కే)ల ద్వారానే అందేవి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు రైతులకు వ్యవసాయానికి ఏది కావాలన్నా ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడింది. కొన్నిచోట్ల రైతులు, రైతు సంఘం నాయకులు రైతు సేవలకు ఉపయోగపడే కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా ఉన్నాయని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

గ్రామస్థాయిలోనే రైతులకు సేవలందించాలి



రైతులు తమ సమస్యలు విన్నవించుకోవాలంటే ప్రస్తుతం ఎవరి దగ్గరకు వెళ్లాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. గతంలో రైతుసేవా కేంద్రాలో సిబ్బంది అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలు 10 నుండి 7 కు కుందిచే అనాలోచిత నిర్ణయం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మాదిరిగా రైతులకు అన్ని సేవలూ గ్రామాల్లోనే అందించాలి.

– శ్రీరాములు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు

కియోస్క్‌లను అందుబాటులోకి తెస్తాం



మండలంలో 10 కియోస్క్ యంత్రాలు ఉన్నాయి. ఇంటర్ నెట్ సమస్యల కారణంగా యంత్రాలు పనిచేయడం లేదు.కొన్ని చోట్ల కియోస్క్ యంత్రాలకు స్క్రీన్లు దెబ్బతిన్నాయి. త్వరలోనే వాటిని గుర్తించి మరమ్మతు చేయించి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

–లక్ష్మీప్రియ, ఏఓ, నల్లచెరువు మండలం

కబడ్డీలో గొట్లూరు విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: పట్టణంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలలో గొట్లూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచి రన్నరప్‌గా నిలిచారు. గత నెల 15 నుంచి గత నెల 25 వరకు నిర్వహించిన టోర్నమెంట్‌లో ఫైనల్ మ్యాచ్‌లో కొత్తపేట మున్సిపల్ హైస్కూల్, గొట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులు పోటీ పడ్డారు. ఇందులో గొట్లూరు జట్టు రన్నరప్‌గా నిలిచినట్లు పాఠశాల పీడీ రమేష్ బాబు తెలిపారు. శుక్రవారం ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయులు జగన్నాథం, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు అభినందించారు.

క్షయపై అవగాహన



కాళసముద్రం గ్రామంలో క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: కాళసముద్రం గ్రామంలో శుక్రవారం క్షయపై టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి సాయంత్రం పూట జ్వరము, ఆకలి లేకపోవడం లక్షణాలు ఉంటే సమీప ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గళ్లపరీక్ష పరీక్షచేయించుకోవాలన్నారు. గళ్లపరీక్షలో పాజిటివ్ వస్తే 6 నెలల పాటు రోగికి పౌష్టికాహారం కోసం రూ. 1000 చెల్లిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రాజేశ్వరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులు తయారు చేసిన కరపత్రాలను చూపుతున్న దృశ్యం

ధర్మవరం రూరల్: పట్టణంలోని రిషి పాఠశాలలో ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కరణ్ స్వరూపా సింగ్ మాట్లాడుతు ధూమపానం ప్రమాదకరమన్నారు. వాహనాల నుంచి వెలువడే విషపూరిత రసాయనిక పొగలు పీల్చడం వల్ల శ్వాసకోశ సమస్యలు వస్తాయన్నారు. బయటకు వెళ్లేటప్పుడు మాస్క్ గాని, చేతి గుడ్డ కాని ధరించాలన్నారు. పొగ తాగేవారికి దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత కరపత్రాలను తయారు చేసి వారి తల్లిదండ్రులకు పంపారు. పాఠశాల డీన్ భాస్కర్‌రెడ్డి, సీఈఓ రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గాంధీనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని చిన్నూరు గ్రామానికి చెందిన ఓబులేసు బైక్‌పై వెళుతుండగా గాంధీనగర్ చౌడమ్మ ఆలయం సమీపంలో వెనుక వైపు నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

చెన్నేకొత్తపల్లి: వేరే చోట చదువుకోవడం ఇష్టం లేక ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. నామాల గ్రామానికి చెందిన సంజమ్మ కూలి పనులు చేసుకుంటూ కుమారుడు జగన్మోహన్‌ను చదివిస్తోంది. ఇటీవల విద్యార్థిని పెనుకొండ ప్రభుత్వ వసతి గృహంలో చేర్పించింది. అయితే అక్కడ చదువుకోవడం ఇష్టం లేకపోవడంతో జగన్మోహన్ ఇంటికి వచ్చేశాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషగుళికలు మింగాడు. గమనించిన కుటుంబ సభ్యులు విద్యార్థిని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల కేంద్రంలో శ్మశాన వాటిక కోసం స్థలాన్ని కేటాయించాలని ఆవాజ్ నాయకులు శుక్రవారం తహసీల్దార్ నారాయణస్వామిని కోరారు. ఈమేరకు వారు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేష్, అవాజ్ మండల కార్యదర్శి బాబ్‌జాన్, నాయకులు పక్కీరప్ప, రహీం, జానకి రామయ్య, టైలర్ ముత్తు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



సీఆర్‌పల్లిలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి, నాయకులు



కదిరిలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

తనకల్లు: ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని సీఆర్ పల్లిలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోందన్నారు. అనంతరం ఇంటింటా తిరుగుతూ చంద్రబాబు వంచనను ప్రజలకు వివరించారు. క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ హిమధర్‌రెడ్డి, మహిళా కన్వీనర్ విజయలక్ష్మీ, నాయకులు భక్తవత్సలరెడ్డి, దేశాయి సంజీవరెడ్డి, బీఎస్ కలాం, రెడ్డిపీరా, మండల కమిటీ సభ్యులు ముస్తఫా, నరేంద్ర, సూరి, బయారెడ్డి, స్థానిక నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి ఆనందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సుంకు రాజశేఖర్, శంకర్, చంద్రమోహన్, హనుమంతురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, సోము, సురేష్, వెంకటేష్, వెంకటనారాయణ, ప్రతాప్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సుధాకర్, సిద్దరామిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి, నాగేంద్ర, జశ్వంత్, ప్రతాప్. విష్ణువర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అల్లావుద్దీన్, ప్రతాప్, విశ్వనాథ్‌రెడ్డి, నిజాం, షామీర్, పూల శంకర్, రమణారెడ్డి, బీరప్ప, రవీంద్రారెడ్డి. ప్రకాష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలో 16వ వార్డులోని నాగిరెడ్డిపల్లిలో బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో సాధ్యం కాని హామీలు ఇచ్చి సీఎం చంద్రబాబు ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధిని మరచిన కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకలపై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెడుతోందన్నారు. అనంతరం బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమణారెడ్డి, నాయకులు మదనమోహన్‌రెడ్డి, సంజయ్ బాబు, మహబూబ్ బాషా, సయ్యద్ బాబ్జాన్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు రమేష్‌యాదవ్, చెన్నూర్ గంగాధర్, మైనార్టీ నాయకులు ఎహసాన్ భాయ్, అయూబ్, మొఘల్ ఇర్ఫాన్, చాంద్, చారి తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడికి ప్రత్యేక పూజలు



స్వామి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా ఆలయంలో సామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఆలయ అధికారుల తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

5న జర్నలిస్ట్ డేగా పాటిద్దాం

పుట్టపర్తి టౌన్: ఈనెల 5న జర్నలిస్టుల డిమాండ్ డేగా పాటిద్దామని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, కార్యదర్శి బాబు జర్నలిస్టులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఇప్పటికే అక్రిడిటేషన్లు పలుమార్లు పొడిగిస్తూ వచ్చిందని, ఇకనైనా కొత్త కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టులకు స్థలాలతో పాటు గృహ నిర్మాణాలు చేపట్టాలని, 50 శాతం రాయితీలో రైల్వే పాసులు ఇవ్వాలని, జర్నలిస్టు హెల్త్ కార్డులకు అన్ని కార్పొరేట్ ఆసుపత్రి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పై డిమాండ్లతో ఈనెల 5న జరిగే జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాకు జర్నలిస్టులు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



ఫహీమ్ (ఫైల్‌ఫొటో)

కదిరి టౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు..పట్టణంలోని ఆడపాలవీధికి చెందిన రియాజ్ అహ్మద్ కుమారుడు ఫహీమ్(18) గురువారం రాత్రి పాండ సూపర్ మార్కెట్ వద్ద రోడ్డు దాటుతుండగా గోరంట్ల నుంచి కడపకు వెళ్తున్న కారు ఢీకొంది. ఘటనలో యువకుడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురానికి తీసుకెళ్లారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దుర్గానగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ తల్లం నారాయణమూర్తి, అధ్యక్షుడు జగ్గా వేణుగోపాల్ ఆధ్వర్యంలో గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. హెల్త్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ ప్రియా చేతులమీదుగా 30 మందికి పండ్లను అందించారు. మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు సాయిప్రసాద్, మంజునాథ్, రామకృష్ణ, సల్లా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



కొక్కంటిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్న దృశ్యం



బత్తలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీటీ ఆస్పత్రి సిబ్బంది



నడింగడ్డిపల్లిలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న అంగన్‌వాడీ టీచర్

తనకల్లు: తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైద్యాధికారి ధర్మరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని కొక్కంటిలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు జీవనాధారమన్నారు. శిశువుకు మొదటి ఆరు నెలలు ఖచ్చితంగా తల్లిపాలనే పట్టించాలని సూచించారు. తల్లిపాలలో రోగ నిరోధకశక్తి అధికంగా ఉంటుందని, తల్లిపాలకు ఎలాంటి ప్రత్యామ్నయం లేదని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టి, బాలింతలు, గర్భిణులకు మొక్కలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

బత్తలపల్లి: తల్లిపాలు అమృతంతో సమానమని, బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు బిడ్డకు పట్టించాలని ఆర్డీటీ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ రిషికేష్‌రెడ్డి, డాక్టర్ మహేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఆర్డీటీ ఆసుపత్రి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీటీ వైద్యులు, సిస్టర్ లక్ష్మీ, సోషల్ వర్కర్ లక్ష్మన్న, ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అరుణ్‌కుమార్, విష్ణువర్ధన్, సీహెచ్‌ఓ రాజశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ అశ్వర్థనారాయణలతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. 9వ అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ సరస్వతి తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎర్రమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

గాండ్లపెంట: తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తెలిపారు. మండల కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం బాలింతలకు, గర్భిణులకు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు.

ధర్మవరం రూరల్: నడిమిగడ్డపల్లిలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాల ప్రాముఖ్యత, తల్లీబిడ్డల ఆరోగ్యం తదితర వాటిపై గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యకరం

కనగానపల్లి: తల్లిపాలలో ఉండే పోషకాలే బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమని ఐసీడీఓ సూపర్‌వైజర్ ప్రశాంతి తెలిపారు. మండల కేంద్రం కనగానపల్లిలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్లతో కలసి గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిపాల వల్ల విశిష్టత, ఉపయోగాలు, తల్లులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి తెలియజేశారు.

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ప్యాదిండి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ సరిత మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలలో రోగనిరోధక శక్తితో పాటు శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషక విలువలు ఉంటాయన్నారు. ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకూ తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయన్నారు.